క్లుప్తంగా

ఘనంగా సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ



పాఠశాలలో ప్రతిష్ఠించిన సరస్వతీదేవి విగ్రహం

కోట: గోవిందపల్లెపాళెంలోని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో గురువారం సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మత్స్యకార కాపులు అక్కయగారి శ్రీనివాసులు, మస్తానయ్య, నాగయ్య, వెంకటేశ్వర్లు సహకారంతో సరస్వతీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు కలసి చదువుల తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్న మత్స్యకార కాపులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సొసైటీ చైర్మన్ నాగరాజు పాల్గొన్నారు.

మహా శివలింగాన్ని దర్శించుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న సిస్టర్ వాణి

గూడూరు: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలోని పదివేల రుద్రాక్షలతో తయారు చేసిన మహా శివలింగాన్ని దర్శించుకోవాలని సిస్టర్ బీకే వాణి పేర్కొన్నారు. గురువారం నరశింగరావుపేటలోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 18వ తేదీ శివరాత్రి సందర్భంగా దివ్యమైన 10 వేల రుద్రాక్షలతో శివలింగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే హోలీ గ్రాఫిక్స్‌తో 13 రకాల శివలింగాల దర్శన, పాలాభిషేకం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సిస్టర్ ఉషా, రఘురామిరెడ్డి, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



గేటును ప్రారంభిస్తున్న దేవసేనమ్మ

గూడూరు: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీకళ్యాణ వీరభద్రస్వామి ఆలయానికి సునీత సేవా సంస్థ దాతృత్వంతో ఈశాన్య దిక్కున ఏర్పాటు చేసిన గేటును ఆమె గురువారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సారంగం శ్రీనివాసులు, సులక్ష్మి దేవాలయ ప్రాంగణంలో ఉన్న చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుని, ఆలయానికి అవసరమైన గేటును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్ యాదవ్, రమణయ్య, వెంకటేశ్వర్లు, హాషిం, సాయి, ముని తదితరులున్నారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న శ్రీమంత్‌రెడ్డి

సూళ్లూరుపేట: మున్సిపాలిటీధిలోని మన్నారుపోలూరు అమెరికన్ హాస్టల్‌లో ఉన్న 60 మంది అనాథ పిల్లలకు గురువారం మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి చేతులు మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. పూసల సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ తుపాకుల ప్రసాద్, పార్టీ నాయకులు గోగుల తిరుపాల్ వీటిని వితరణ చేశారు.

ప్రతిభ వెలికి తీయాలి



దుస్తులు అందజేస్తున్న దాతలు

చిల్లకూరు: ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలని ఎంఈఓ శ్రీహరి సూచించారు. మండలంలోని చేడిమాల గ్రామానికి చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రంలోని పిల్లలకు దుస్తులు ఇచ్చేందుకు ట్రస్టు నిర్వాహకులు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ట్రస్టు నిర్వాహకులు రాజనేని శ్రీనివాసులు, శిరీషా పిల్లలకు దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు శివ, భవిత కేంద్రం శిక్షకురాలు శిల్ప, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కొండయ్య, ట్రస్టు ప్రతినిధి బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

కోట: స్థానిక దళితవాడలో విద్యుత్ సమస్యలు పరిష్కారం దిశగా అధికారులు చర్యలు ప్రారంభించారు. కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కాలనీ వాసులు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌కో అధికారులు దళితవాడలో మొత్తం 40 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నట్లు గుర్తించి, ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. కొత్త విద్యుత్ స్తంభాలు మంజూరు కావడంతో వాటిని ఏర్పాటు చేసే పనులను సిబ్బంది ప్రారంభించారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే అభివృద్ధి



ఎమ్మెల్యే వరప్రసాద్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న దుగరాజపట్నం గ్రామస్తులు

గూడూరు: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాకే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, అలాగే పార్టీలకతీతంగా అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన గురువారం సాయంత్రం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మతో కలసి నాయకులతో పలు విషయాలపై చర్చించారు ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాకే డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీస్(డీపీఐఐటీ) నివేదిక మేరకు 2022 జూలై చివరి నాటికి దేశంలో రూ.1,71,285 కోట్ల పెట్టుబడులు రాగా, రాష్ట్రానికే రూ.40,361 కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. కేంద్రం జీఎస్‌డీపీ కన్నా రాష్ట్ర జీఎస్‌డీపీ 2.73 శాతం ఎక్కువగా ఉందని తెలిపారు. దేశ తలసరి ఆదాయం కంటే రాష్ట్ర తలసరి ఆదాయం 38.50 శాతం ఎక్కువగా ఉందన్నారు. ఉదాహరణకు కడపలో జిందాల్ పరిశ్రమ ద్వారా రూ.8,800 కోట్లు, అదానీ గ్రీన్ ఎనర్జీ రూ.6,330 కోట్లు ఇలా ఎన్నో పరిశ్రమల ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చాయన్నారు. రాష్ట్రంలో ఈ స్థాయిలో అభివృద్ధి జరిగితే, ఏదో బురద జల్లే ప్రయత్నంగానే టీడీ పీ కుట్రపూరిత రాజకీయాలను చేస్తోందన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ మాట్లాడుతూ రాష్ట్రమే కాకుండా, గూడూరు నియోజవర్గం కూడా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఈ సమావేశంలో సంగీత,నృత్య అకాడమీ డైరెక్టర్ యారం మంజుల, పార్టీ పట్టణ అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, జిల్లాఅధికార ప్రతినిధి నాశిన నాగులు, రాజారెడ్డి, టీ శ్రీనివాసులు, బిక్కు సాహేబ్, అజీజ్, వినీష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

నియోజకవర్గ ప్రజల సమస్యను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని, ఆ దిశగా తనవంతు అహర్నిశలూ కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే వరప్రసాద్ రావు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో గురువారం వాకాడు మండలం దుగరాజపట్నం గ్రామానికి చెందిన పలువురు, తమ గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రోడ్లు దెబ్బతిన్నాయని, వాటి మరమ్మతులు చేయించాలని దుగరాజపట్నం వాసులు కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని రావిగుంటపాళెం నుంచి శ్రీనివాసపురం వరకు ఉన్న గ్రావెల్ రోడ్డు మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయిస్తామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం అందరికీ అందుబాటులో ఉంటూ, దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

కుంభాభిషేక వేడుకల్లో నేదురుమల్లి



కుంభాభిషేక వేడుకల్లో పూజలు చేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: పట్టణంలోని ఆత్మామాలిక్ ధ్యానపీఠంలో నూతనంగా నిర్మించిన శ్రీవల్లి దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ మహాకుంభాభిషేకం వేడుకల్లో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి, ఆలయ సంప్రదాయం మేరకు పూజలు చేశారు.

ఆర్‌ఎంపీ వైద్యుడి కుటుంబ సభ్యులకు పరామర్శ

డక్కిలి మండలం మోపూరు రోడ్డు వద్ద హత్యకు గురైన ఆర్‌ఎంపీ వైద్యుడు సందానీ బాషా కుటుంబ సభ్యులను నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు చెలికం శంకర్‌రెడ్డి, నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, పోలేరమ్మ ఆలయ ట్రస్టు మాజీ చైర్మన్ పులి ప్రసాద్ రెడ్డి, జయంపు పీఏసీఎస్ అధ్యక్షుడు వెందోటి కార్తీక్ రెడ్డి, తోట గణేష్‌రెడ్డి, కౌన్సిలర్ వహిదాయస్మీన్, పాదిలేటి దశరథరామిరెడ్డి, బాలాయపల్లి ఎంపీపీ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వాకాడుకు రాక

వాకాడు: నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం వాకాడుకు రానున్నట్లు ఆ పార్టీ నాయకుడు పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. వాకాడులోని ఆయన నివాసంలో నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

ముమ్మరంగా ఓటర్ ఐడీకి ఆధార్‌లింక్ ప్రక్రియ

దొరవారిసత్రం: మండలంలోని పలు గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది గురువారం ఇంటింటికీ వెళ్లి ఓటర్ ఐడీకి ఆధార్ నంబర్, ఫోన్ నంబర్ లింక్ చేసే ప్రక్రియ ముమ్మరంగా చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని గత నెల నుంచి తమ వీఆర్వో, వీఆర్‌ఏలు నిర్వహిస్తున్నారని స్థానిక తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి తెలిపారు.

భూములు పంపిణీ చేయాలి

ఓజిలి: అర్హులైన నిరుపేదలకు భూములను పంపిణీ చేయాలని అత్తివరం ఎంపీటీసీ సభ్యుడు కొట్టు శేఖర్ అన్నారు. మండల రెవెన్యూ కార్యాలయ ఆవరణలో గురువారం విలేకరులతో మాట్లాడారు. కుందాం పంచాయతీలోని అత్తివరం, ఏనుగువాడ, కుందాం, కుందాం రాచపాళెం గ్రామాల్లో అర్హులైన ఎస్సీ, ఎస్టీ పేదలకు భూపంపిణీలో అవకాశం కల్పించాలన్నారు.

సమస్యలపై వినతి

చిల్లకూరు: మండలంలోని ఏపీటీఎఫ్‌కు చెందిన ఉపాధ్యాయులు తమ సమస్యలను పరిష్కారించాలని తహసీల్దార్ స్వర్ణకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రశాఖ పిలుపు మేరకు మండలంలోని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులంతా తహసీల్దార్‌ను కలసి వినతిపత్రం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం రాజు, శ్రీనివాసులు, రాజశేఖర్, దిలీప్ పాల్గొన్నారు.

కోటి మహామంత్ర జప పూజలు ప్రారంభం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని వల్లి దేవసేన సమేత షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వస్వామి ఆలయంలో స్వామి వారి పేరుతో కోటి మహా మంత్రం జపం పూజలను గురువారం భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు. ముందుగా ఆలయం వద్ద భక్తులతో సంకల్పం చెప్పించి గణపతి పూజ చేసి, అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణ శర్మ చేపట్టారు. ఈ సందర్భంగా ధర్మకర్త మాట్లాడుతూ లోకా కల్యాణార్థం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి పేరుతో కోటి మహామంత్రం జప పూజలను గురువారం నుంచి జూలై 13 తేదీ వరకు 146 రోజులు పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. 147 రోజు దశమి రోజున పూర్ణాహుతి, 148 రోజు ఆడి కృతిక రోజున స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం జరపనున్నట్లు చెప్పారు.

చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

ఓజిలి: మండలంలోని పెదపరియ గ్రామంలో తాటిచెట్టుపై నుంచి పడి కల్లుగీత కార్మికుడికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు పెదపరియ గ్రామానికి చెందిన కీర్తక వెంకటేశ్వర్లు బుధవారం రాత్రి గ్రామానికి సమీపంలో తాటిచెట్టుపై కల్లు దించుతూ ప్రమావశాత్తు కిందపడిపోవడంతో గాయలయ్యాయి. బంధువులు గూడూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యం

చిల్లకూరు: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని గురుకుల పాఠశాల విద్యార్థులకు చిల్లకూరు వైద్యులు సయ్యద్ షాలోమ్ అరాఫత్ సూచించారు. చిల్లకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గురువారం విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవన్నారు. అనంతరం వంట గదిని పరిశీలించారు. అలాగే మరుగుదొడ్లను తనిఖీ చేసి అక్కడ అపరిశుభ్రతపై అసహనం వ్యక్తం చేశారు. వైద్యుడు వెంకటేశ్వ ర్లు, ప్రిన్సిపల్ మీరాసాహెబ్, సీహెచ్ఓ శ్రీనివాసులు, రవికుమార్, మునిలక్ష్మి, పోలమ్మ, సావిత్రి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

వెంకటగిరిరూరల్: డ్వాక్రా మహిళ లు సబ్సిడీ రుణాలు సద్వినియో గం చేసుకోవాలని ఐసీడీఎస్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభావతి అన్నారు. స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య ఈసీ సమావేశం నిర్వహించారు. ఏపీ డీ మాట్లాడుతూ మహిళలను వ్యాపారాల్లో చైతన్యం పరిచేందుకు హైయర్ ఆర్డర్ ఎంటర్‌ప్రైజెస్(హెచ్ఓఈ), ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం(పీఎంఎస్‌బీవై) ద్వారా సబ్సిడీ రుణాలను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఏరియా కోర్డినేటర్ ఆదినారాయణ పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ.. మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదం



చెక్కు అందజేస్తున్న డాక్టర్ జనార్దన్‌రెడ్డి

గూడూరు: మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కుట్టుశిక్షణ ఎంతో దోహదపడుతుందని ప్రముఖ వైద్యుడు సీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలు ఆవరణలో వైజేపీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వడంతో వారు కొంత మేరకు ఆర్థికంగా స్థిరపడి, కుటుంబానికి ఆసరాగా నిలుస్తారన్నారు. అనంతరం రొటేరియన్ దశరథరామిరెడ్డి రూ.30 వేలు, బాబూరావు రూ.10 వేల విరాళ చెక్కులను క్లబ్ అధ్యక్షుడు రవీంద్రరెడ్డికి జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అలాగే ఫాస్ట్ ప్రెసిడెంట్ ముప్పాళ్ల మురళీరాజు రెండు, గోపీనాథ్‌రెడ్డి, పీవీ మనోజ్‌లు ఒక్కొక్క కుట్టు మిషన్‌లను అందజేశారు. సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, వైస్ గవర్నర్ గౌతం, రీజినల్ చైర్మన్ పీ శ్రీరాములు, ఆర్‌వీరావు, సుబ్రమణ్యం, వేణురెడ్డి, కేవీ నారాయణరాజు, రాధాకృష్టారెడ్డి వెంకట్రామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

గూడూరు: అంబేడ్కర్‌ను అవమానించిన దోషుల ను వెంటనే కఠినంగా శిక్షించాలని ఆయన అభిమానులు, ప్రజా, కుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నంద్యాలలోని బొమ్మలసత్రంలో అంబేడ్క ర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ, స్థానిక తపాలా కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహానికి చూపుడు వేలుతో పాటు, ముక్కును తొలగించి, తలపై బండరాళ్ల నుంచి అవమానించడం మనోభావాలను దెబ్బతీ సే చర్య అన్నారు. ఏ పార్వతయ్య, ఎన్ భాస్కర్ గౌ డ్, ఎల్వీ సుబ్బయ్య, వీ విజయ్‌కుమార్, రవీంద్రబా బు, గోవిందనాయక్, అన్వర్‌బాషా, తాజుద్దీన్, డీ కృష్ణ, పీ భాస్కర్, ఏ సురేష్, జీ దామోదర్ పాల్గొన్నారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

నెల్లూరు(లీగల్): తాను సహజీవనం చేస్తున్న మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడనే అనుమానంతో ఓ వ్యక్తిని కత్తితో పొడిచి హత్య చేసిన కేసులో నేరం రుజువు కావడంతో కోర్టు నిందితుడికి జీవితఖైదుతోపాటు రూ.10 వేల జరిమానాను విధించింది. ఈ మేరకు నెల్లూరు ఐదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం.మాధురి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. కలువాయి గ్రామానికి చెందిన నిందితుడు హరి, మృతుడు శ్రావణ్‌కుమార్ స్నేహంగా ఉండేవారు. వీరికి మద్యం, పేకాట అలవాటు ఉండేది. కాగా నిందితుడు హరి సహజీవనం చేస్తున్న ఓ మహిళతో శ్రావణ్‌కుమార్ చనువుగా ఉండేవాడు. వీరి నడుమ వివాహేతర సంబంధం ఉందని నిందితుడు హరికి అనుమానం కలిగింది. అయినా ఏమీ తెలియనట్లు స్నేహంగా ఉండేవాడు. తన అవసరం నిమిత్తం శ్రావణ్‌కుమార్ నుంచి రూ.3 వేలు అప్పుగా తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో నిందితుడు హరి, శ్రావణ్‌కుమార్ కలిసి రాపూరు మండలం తెగచెర్ల గ్రామంలో డైమండ్ జూదానికి వెళ్లారు. ఇందులో నగదు పోగొట్టుకున్న శ్రావణ్‌కుమార్ తనకు ఇవ్వాల్సిన రూ.3 వేల కోసం నిందితుడిని నిలదీశాడు. దీంతో శ్రావణ్‌కుమార్‌ను హరి అసభ్యకరంగా మాట్లాడాడు. ఈ నేపథ్యంలో శ్రావణ్‌కుమార్‌పై అతను కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో 2015 జనవరి 15న బహిర్భూమికి వెళ్లాలని శ్రావణ్‌కుమార్‌తో కలిసి హరి రాత్రి 9 గంటల సమయంలో ఊరుబయట పొల్లాల్లోకి తీసుకెళ్లాడు. అక్కడ తన వెంట తెచ్చుకున్న కారపు పొడిని శ్రావణ్‌కుమార్ కళ్లల్లో చల్లి కత్తితో ఇష్టానుసారంగా పొడిచి హత్య చేశాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలువాయి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితుడిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

శతశాతం ఫలితాల సాధనకు కృషి



విద్యార్థి తల్లిని విచారిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు

చిల్లకూరు: పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేస్తున్నామని చిల్లకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కోదండరామయ్య తెలిపారు. చిల్లకూరులో గురువారం రాత్రి పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి మీపిల్లలు ఎంత సేపు పుస్తక పఠనం చేస్తున్నారనే విషయాలపై తల్లిదండ్రులను ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ పది చదువుతున్న విద్యార్థులు ఏ గ్రామం నుంచి వస్తున్నారో ముందుగా గుర్తించి, వారి ఇళ్లకు వెళ్లి వారి చదువులపై ఆరా తీస్తున్నామని చెప్పారు. ఆయన వెంట టీచర్లు జాన్ పీటర్, చంద్ర, తదితరులు ఉన్నారు.

ఆటో బోల్తా.. ఎనిమిది మందికి గాయాలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని చంద్రబాబు కాలనీ సమీపంలో ఆటో అదుపుతప్పి రైల్వే అండర్ బ్రిడ్జి గోడను ఢీకొని, బోల్తా పడింది. గురువారం జరిగిన ఈ ఘటనలో ఎనిమిది మంది గాయపడ్డారు. పోలీసులు కథనం మేరకు.. సత్యవేడుకు చెందిన కొంతమంది మండలంలోని కల్లిపేడు గ్రామంలో జరుగుతున్న ఓ శుభకార్యానికి వచ్చారు. వారిలో ఎనిమిది మంది తిరిగి స్వగ్రామానికి ఆటోలో బయలు దేరారు. మార్గం మధ్యంలో చంద్రబాబు కాలనీ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిలో వెళుతుండగా ఆటో అదుపు తప్పి గోడను ఢీకొని, బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న సత్యవేడుకు చెందిన కటారి సుబ్బమ్మ, తుపాకుల శీను బాబు, తుపాకుల సుబ్బమ్మ, చిలమత్తూరు గ్రామానికి చెందిన గునపాటి రమణమ్మ తీవ్రంగా గాయపడ్డారు. అలాగే సత్యవేడుకు చెందిన గోపన్న, టీ హరిత, కల్లిపేడు గ్రామానికి చెందిన సీహెచ్ దేవి, ఎస్ఎస్ఆర్ కాలనీకి చెందిన టీ పూజ తదితరులకు స్వల్ప గాయాలయ్యాయి. తడ మండలం అక్కంపేట గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ అదూరి మునిరాజా పరారయ్యాడు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ధర్మయ్య తెలిపారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి



అర్బన్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం ప్రభుత్వ వైద్యసేవలను అందించేందుకు అర్బన్ హెల్త్ క్లినిక్‌ల పేరుతో మినీ ప్రభుత్వ వైద్యశాలలను ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు కిలివేటి సంజీవయ్య అన్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీలోని మన్నారుపోలూరులో అర్బన్ హెల్త్‌క్లినిక్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన దేవాంగ వెల్ఫేర్ సంఘం ప్రతినిధి మన్నెముద్దు శ్రీనివాసులు అర్బన్ హెల్త్‌క్లినిక్‌కు రెండు బెడ్లు వితరణ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో కూడా పట్టణ శివారు ప్రాంతాల ప్రజలకు అనుకూలంగా అర్బన్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లులా చూస్తున్న జగనన్

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమాన్ని రెండుకళ్లులా చూస్తున్నారని, ఆయన్ని విమర్శించే ముందు టీడీపీ నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సూళ్లూరుపేటలోని బాపూజీవీధిలో సుమారు రూ.90 లక్షలతో వేస్తున్న సిమెంట్ రోడ్డు పనులను గురువారం ఎమ్మెల్యే కిలివేటి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి జరగలేదన్న టీడీపీ నాయకులకు బజారువీధిలో సిమెంట్ రోడ్డు కనిపించడం లేదా? అని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలోనే సూళ్లూరుపేట నియోజకవర్గంలో సుమారు 8 కిలోమీటర్లు సింగిల్‌రోడ్డును డబుల్‌రోడ్డుగా విస్తరించి, రోడ్డు వేశామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యులు ఉమ్మిటి రమ్య, బందిల మహేష్, గునపాటి మనస్వామి, తుపాకులు సుశీల, పేర్నాటి లక్ష్మీదేవి, పొన్నా మునిప్రసాద్, శరత్‌గౌడ్, తుపాకులు ప్రసాద్, పార్టీ నాయకులు గోగులు తిరుపాల్, చెంగాళమ్మ ఆలయ పాలకమండలి సభ్యులు మన్నెముద్దు పద్మజ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ఆరంభం

- నోటిఫికేషన్ విడుదల
- ఐదు డివిజన్లలో పోలింగ్ కేంద్రాలు

కేంద్రం	ఓటర్ల సంఖ్య
ఆత్మకూరు	40
కావలి	110
నెల్లూరు	265
గూడూరు	133
సూళ్లూరుపేట	115

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల కోటాకు సంబంధించిన ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికల ప్రక్రియ ఆరంభమైంది. గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమల్లోకి వచ్చింది. ఈనెల 16 నుంచి 23వ తేదీ వరకు నామినేషన్లను కలెక్టరేట్‌లో స్వీకరిస్తారు. పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు నామనేషన్ పత్రాల నమూనాలను జాయింట్ కలెక్టర్ లేదా జిల్లా రెవెన్యూ అధికారి నుంచి పొందవచ్చు. ఆయా తేదీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. అభ్యర్థితోపాటు నలుగురిని మాత్రమే ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో) వద్దకు అనుమతిస్తారు. మూడు కంటే ఎక్కువ కార్లను అనుమతించరు. ఆర్వో కార్యాలయానికి వంద మీటర్ల పరిధిలో పోలీసు బందోబస్తు ఉంటుంది. ఈ పరిధిలో అభ్యర్థి, మరో నలుగురిని మాత్రమే అనుమతిస్తారు.

24న పరిశీలన

నామనేషన్లను ఈనెల 24వ తేదీన పరిశీలిస్తారు. వాటి ఉప సంహరణకు ఈనెల 27వ తేదీ వరకు గడువు ఉంటుంది. మార్చి 13న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. 16న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఎన్నికల ప్రక్రియ 21వ తేదీ నాటికి పూర్తవుతుంది.

సిబ్బందికి శిక్షణ

ఎన్నికల నిర్వహణకు సంబంధించి సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు సిబ్బందికి శిక్షణ అందిస్తారు. ఉమ్మడి జిల్లాలో ఐదు డివిజన్లలో 763 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన పోలీసు బందోబస్తు, ఇతర సిబ్బంది నియామకాల కోసం ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. నోడల్ అధికారులను నియమిస్తూ కలెక్టర్ చక్రధర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఐదు డివిజన్ల ప్రధాన కార్యాలయాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించారు.

ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి ప్రచారం



టీచర్లతో సమావేశమైన ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

కలువాయి: తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి తరఫున గుంటూరు ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి గురువారం కలువాయి, అనంత సాగరం మండలా ల్లో పర్యటించి, ప్రచారం చేశారు. ఆమె సోమశిల, కలువాయి, చీపినాపి, కుల్లూరు, వెరుబొట్లపల్లె గ్రా మాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు, పట్టభద్రులను కలిసి వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఆమె వెంట కలువాయి జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్ రెడ్డి ఉన్నారు.

జాతీయ అథ్లెట్‌కి సన్మానం



అథ్లెటిక్ వెంకటరావును సన్మానిస్తున్న అధికారులు

నాయుడుపేట: జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో హైజంప్ విభాగంలో ద్వితీయస్థానం సాధించి, రజిత పతకం అందుకున్న పండ్లూరు పంచాయతీ కార్యదర్శి గుంటూరు వెంకటరావును గురువారం పలువురు సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డీఎల్‌పీఓ వెంకటరమణ, ఎంపీడీఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటరావుకు శాలువ కప్పి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సుమతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్‌కుమార్, కార్యదర్శులు సుమన్, రవి, యోగి తదితరులు పాల్గొన్నారు.

ఐఐహెచ్‌టీ అభివృద్ధికి చర్యలు



ఐఐహెచ్‌టీని పరిశీలిస్తున్న సునీత

వెంకటగిరి: పట్టణంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ) అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్లు ఐఐహెచ్‌టీ హ్యాండ్‌లూమ్, టెక్స్‌టైల్స్ కార్యదర్శి సునీత పేర్కొన్నారు. గురువారం స్థానిక ఐఐహెచ్‌టీ కళాశాలను ఆమె సందర్శించారు. కాలేజీలో మౌలిక వసతులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోనున్నట్లు తెలిపారు. విద్యార్థులు విద్యపై దృష్టి సారించి రాణించాలని ఆకాంక్షించారు. ఆర్డీఓ కిరణ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు



నగదు అందజేస్తున్న పెంచలయ్య, సులోచనలు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గురువారం ఇద్దరు దాతలు రూ.3 లక్షల విరాళాలు ఇచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన బండ్ల నరసయ్య, కాంతమ్మ దంపతులు రూ.2 లక్షలు అందజేశారని తెలిపారు. అలాగే వెంకటగిరికి చెందిన గోల పెంచలయ్య, సులోచన దంపతులు రూ. 1,00,116 నగదు అందించినట్లు చెప్పారు. దాతలకు మూడు ఆలయాల్లో ప్రత్యేకపూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు బాలాజీ స్వామి, సిబ్బంది పెంచలరెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాపూరమ్మ విగ్రహప్రతిష్ఠ



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

రాపూరు: గ్రామదేవత రాపూరమ్మ విగ్రహప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం, గ్రామోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయ శిఖర శ్రీచక్రం ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, చాయ దర్శనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతర అన్నదానం చేశారు. సాయంత్రం కుంకుమార్చన సేవ జరిపారు. రాపూరమ్మ గ్రామోత్సవం నిర్వహించారు.